
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024 | 5



పర్యాటకులకు అనుమతుల్లేవ్ : సబ్‌కలెక్టరు

ఏజెన్సీలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు నిలిపివేసినట్టు రంపచోడవరం సబ్ కలెక్టరు కల్పశ్రీ తెలిపారు. ఎవరైనా వస్తే తిరిగి వెనక్కి పంపించాలని అధికారులను ఆదేశించారు. అయితే అటవీశాఖాధికారులు మాత్రం టిక్కెట్లు విక్రయించి మరీ పర్యాటకులను జలపాతాల వద్దకు అనుమతించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి పరిస్థితుల పట్ల అవగాహన లేక పర్యాటకులు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు.

వీళ్లు గల్లంతు



సౌమ్య | అమృత | హారదీప్ | చికిత్సపొందుతున్న హరిణి



కన్నీటివాగు: ఒక్కసారి ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగిణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదతీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలను దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14 మందిలో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలంతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగిణి వాగు

- ఆశ్రం విద్యార్థుల విహార యాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన వైనం
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 22: వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది. అప్పటిదాకా ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14 మంది టెంపో ట్రావెలర్‌లో శనివారం రాత్రి విహార యాత్రకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణి జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసేవారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణిప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు. ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు. కాసేపటికి జలపాతం దిగువున కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణిలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య (21), బాలి అమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్య విద్యార్థుల కోసం తమ కళాశాల తరపున ప్రత్యేక బృందాన్ని పంపించామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

'ఆశ్రం'లో తీవ్ర విషాదం...

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది. కార్డియాలజీలో ప్రత్యేక వైద్య నిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయంతో ఉంది. కొసిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువు కొనసాగిస్తోంది. ముగ్గురూ కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాల విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే...

గల్లంతైన విద్యార్థులు : కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22) (విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్ (20) (ప్రకాశం జిల్లా మార్కాపురం) **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప (బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రజ్ఞ (భీమిలి) **మిగిలినవారు:** హిమబిందు (బొబ్బిలి), మేఘన (కర్నూలు), స్వప్న (అనంతపురం), హరి నేత్ర (చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమహేంద్రవరం), జాగృతి (ద్వారకా తిరుమల)

పులిపిరి (సురిడి కాయ) ఆకు పసరుతో మటుమాయం

తూర్పుగోదావరి జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. శీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

23, 24, 25 తేదీల్లో కాకినాడ మెయిన్ రోడ్, చందనా బ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి **(సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6.00 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్టేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

వాడపల్లిలో విశ్రాంతి గది నిర్మాణానికి

రూ.15.31 లక్షలు విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా 500 విశ్రాంతి గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన రాయవరపు సూర్యనారాయణ-సత్యదేవి దంపతుల కుమారుడు రాము దంపతులు ఒక గదికి రూ.15.31 లక్షలను విరాళంగా ఆదివారం అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.



విశ్రాంతి గది నిర్మాణానికి విరాళం అందిస్తున్న విశాఖపట్నానికి చెందిన రాము దంపతులు

శెట్టిబలిజ సంఘం సమావేశం రసాభాస

ఇరువర్గాల మధ్య తోపులాట... చెదరగొట్టిన పోలీసులు

రామచంద్రపురంలో ఘటన...7లో



రామచంద్రపురంలో ఓ ఇంటికి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

హర్షాతిరేకాలు

'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల వద్దకు ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్న కూటమి నేతలు

విజ్ఞాపనలు స్వీకరిస్తూ... భరోసా ఇస్తున్న వైనం

చంద్రబాబు పాలన బాగుందంటున్న అన్ని వర్గాల ప్రజలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రిగా అధికారపగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తిచేసిన నారా చంద్రబాబునాయుడు పాలనపై అటు కూటమి పార్టీల్లోను, ఇటు ప్రజల్లోను హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల్లోకి వెళ్లి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. అంతేగాక గ్రామస్థాయిలో సభలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ముద్రించిన స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అతికింపచేస్తున్నారు. ప్రజల నుంచి కూడా సానుకూల స్పందన వస్తుండడంతో వంద రోజుల పాలనపై ఎమ్మెల్యేలు కూడా అదే జోరుతో దూసుకుపోతున్నారు. సంక్షోభంలోనూ సంక్షేమాన్ని కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా కీర్తిని గత నాలుగు రోజులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ ప్రజల్లోకి తీసుకువెళుతున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ (రామచంద్రపురం), లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్‌మాధుర్, టీడీపీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట), జనసేన ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దేవ వరప్రసాద్ (రాజోలు) వారి నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ చంద్రబాబు వంద రోజుల పాలనలో సాధించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ వారి స్పందనను అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో కూడా పెన్షన్ల పంపిణీ కొనసాగించడం పట్ల పేదవర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పరోక్షంగా గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ చంద్రబాబు వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని వారి ముందుకి తీసుకువెళుతున్నారు. ప్రజలు సైతం సానుకూలంగా ఉంటూ ఎమ్మెల్యేలను అభినందిస్తున్నారు. ప్రజల్లోకి వెళుతున్న ఎమ్మెల్యేలు ప్రస్తుతం రానున్న రోజుల్లో ఆయా గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ప్రజల నుంచి విజ్ఞాపనలు తీసుకుంటూ వారికి భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం సీఎస్ఆర్ నిధులతో పాటు ప్రభుత్వం అందించే నిధులతో రానున్న రోజుల్లో రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సదుపాయం వంటివి కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు అయితే ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల కష్టనష్టాలను నేరుగా అడిగి తెలుసుకోవడంతో పాటు గత ప్రభుత్వానికి, ఇప్పటికీ ఉన్న వ్యత్యాసంపై కూడా ప్రజా స్పందనను తెలుసుకునే పనిలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ అధిక సంఖ్యలో పాల్గొంటోంది.



రాజోలు మండలం పొన్నమండ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, వేదికపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా



కపిలేశ్వరపురంలో గ్రామ సభలో మాట్లాడుతున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు. వేదికపై ఎంపీ హరీష్‌మాధుర్



అమలాపురం రూరల్ మండలం పేరూరులో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, మెట్ల రమణబాబు



కేశఖండనశాలకు వెళ్లే రహదారిని మూసివేసి వంటలు చేస్తున్న దృశ్యం

రోడ్డు మూసేసి విందు భోజనాలు



ఆ పక్కనే మాంసం విక్రయాలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గోదావరి చెంతన గల కేశఖండనశాలకు వెళ్లే మార్గంలో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుండగా ఆదివారం ఈ రహదారిని స్థానికులు శుభకార్యం నిమిత్తం మూసేసి మాంసాహార విందును రోడ్డుమీదే పెట్టారు. దీంతో భక్తులు అటువైపు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత దేవస్థానంపై ఎంతైనా ఉంది.



కేశఖండనశాలకు వెళ్లే మార్గంలో మాంసం విక్రయాలు

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

కోనసీమకు జగత శ్రీనివాస్

ఉత్తర్వులు జారీ చేసిన పీసీసీ చీఫ్... 7లో

నేడు యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 22: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు గ్రీవెన్స్ ప్రారంభమవుతుందని, అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆత్రేయపురం మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని, కొత్తపేట డివిజన్ అధికారులు పాల్గొనాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలో ఉన్న అధికారులు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని కోరారు.



లైసెన్స్డ్ ఆర్కిటెక్ట్స్ సర్వేయర్ ఇంజనీర్స్ నూతన కార్యవర్గం

అమలాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోనసీమ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్డ్ ఆర్కిటెక్ట్స్ సర్వేయర్ ఇంజనీర్స్ వెల్ఫేర్ సమావేశం ఆదివారం అమలాపురంలోని సత్యనారాయణ విలాస్‌లో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. 2024-2026కు సంబంధించి కోనసీమ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్డ్ ఆర్కిటెక్ట్స్ సర్వేయర్ ఇంజనీర్స్ మెంబర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రాంబాబు ఆధ్వర్యంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా వై.దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఫణికుమార్, కోశాధికారిగా మలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఈబీఎల్ఎస్ శ్రీనివాస్, బి.కృష్ణమోహన్, కె.రామచంద్రరారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బాలకృష్ణ, సంయుక్త కోశాధికారిగా శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.కుమార్, జి.గోవిందు, బి.భరత్‌బాబు, రెడ్డి, సూర్యసాయికృష్ణ, వినయ్‌కృష్ణ ఎన్నికయ్యారు. విశిష్ట అతిథులుగా హాజరైన రాంబాబు, ఏపీ సుబ్బారావు నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

నేడు 'సఫాయి సురక్ష' వైద్య శిబిరాలు

అమలాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సఫాయి సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిబిరాల్లో పంచాయతీ, మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులందరూ అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. మందులు కూడా ఉచితంగా ఇస్తారన్నారు. జిల్లాలో వైద్య శిబిరాలు జరిగే ప్రాంతాలివే.. అమలాపురంలోని ఏరియా ఆసుపత్రి, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం, మండపేటల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి. జిల్లాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీవో విజ్ఞప్తి చేశారు.

తింటే రోగాలే!

- బయట ఫుడ్ నో సేఫ్
- 80 శాతం అనారోగ్యాలకు అదే కారణం
- హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత తనిఖీలు పత్తాలేదు
- జిల్లా వ్యాప్తంగా పైసా వసూళ్లు ● కానరాని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు



కుళ్లిన కోడిగుడ్లు, మసాల పెట్టి నిల్వచేసిన పాడైన చికెన్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు22: నేటి ఆధునిక యుగంలో అందరూ క్షణం తీరిక లేకుండా రోజులు గడిపేస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో వండుకుని తినే పరిస్థితులు లేక నూటికి 60శాతం మంది బయటే ఆహారం తీసుకుంటున్నారు. ఇది వారి ఆరోగ్యానికి సేఫ్‌కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బయట ఆహారం అనారోగ్యకరమని అనేక సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. కొంత మంది ఉద్యోగాలు, వృత్తుల రీత్యా ఇంట్లో వండిన భోజనాలు తినే పరిస్థితిలేక బయట హోటల్స్, రెస్టారెంట్లను ఆశ్రయిస్తుంటారు. కొన్ని హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను పరిశీలిస్తే అనేక దారుణ విషయాలు బయటకు వస్తున్నాయి. పాడైన మటన్, చికెన్, చేపలు, గుడ్లు వంటి వాటిని ఫ్రిజ్‌లలో నిల్వలు చేసి వాటిని డ్రైచేసి మసాలా బాగా దట్టించి కూరలలో వినియోగించి వినియోగదారులకు అందిస్తున్నారు. వాటివల్ల అనేక రోగాలబారినపడే ప్రమాదం ఉంది. వినియోగించే వంట నూనెలను వారాల తరబడి వాడిందే వాడుతున్నారు. దీనివల్ల అందులో ఉడికిన పదార్థాలుఅనారోగ్య కారకాలుగా మారతాయి.

నాణ్యతలేని ఆహారంవల్ల వచ్చే వ్యాధులు

బయట నాణ్యతలేని ఆహారం తీసుకోవడం శరీరంలో బ్యాక్టీరియా పెరుగుతోంది. కడుపునొప్పి, వాంతులు విరోచనాలు, అతిసార వ్యాధి, అధిక రక్తపోటు, గుండెపోటు, అజీర్ణం, గ్యాస్ నొప్పులు, టైఫాయిడ్, దద్దుర్లు, శ్వాస సమస్యలు, కండరాలవాపు, రక్తనాళాల సమస్యలు, ఇన్సులిన్ నిరోధకత, టైప్2 మధుమేహంవంటి జబ్బులబారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

80 అనారోగ్య సమస్యలు

సహజంగా ప్రకృతి సిద్ధమైన ఆహారం తాజా కూరగాయలు, నాణ్యతతో కూడిన పండ్లు, ఆహార పానీయాలు అప్పటికప్పుడు తయారుచేసి తీసుకోవడంవల్లన మనిషి ఆరోగ్యంగా జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కంగారుగా హోటల్‌కి పోవడం నచ్చింది ఆర్డర్ చేసేయ్యడం, వచ్చిన వెంటనే బుజించడం ఇది ఇప్పటి ట్రెండ్, బాగా రోస్ట్ చేయించుకుని నచ్చిన రెసిపీలో తినేయడమే దానివెనుక దాగివున్న ప్రమాదాలు ప్రస్తుత యువతరానికి కనిపించడం లేదు. వేడివేడి కూరలు కవర్ ప్యాకింగ్ చేస్తే ఆ ప్లాస్టిక్ వాటిలో కరిగితే అది తింటే ఏమౌతుందో అనే భయం కూడా లేని పరిస్థితి. ఒంట్లో సమస్యలు వచ్చి అది రోగాలకు దారి తీసినప్పుడు మాత్రం అప్పుడు దాని కోసం ఆలోచించే పరిస్థితులు ప్రస్తుత సమాజంలో కనిపిస్తున్నాయి. మందు, గుట్కా, సిగరెట్ వంటి మాదక ద్రవ్యాలు తీసుకుంటేనే క్యాన్సర్ బారిన పడినట్లు కాదు. ఈవేమీ తీసుకోకుండానే కొన్నిరకాల నాణ్యతలేని ఆహారం తీసుకోవడంవల్ల కూడా క్యాన్సర్, లివర్, జీర్ణాశయం వ్యాధుల బారిన పడతారంటే అతిశయోక్తికాదు. ఇలా నాణ్యతలేని ఆహారం భుజించడం ద్వారా 80 శాతం అనారోగ్య సమస్యలు వస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హోటల్ కిచెన్‌లో గోదుమ రంగులోకి మారిన ఆయిల్ (ఫైల్)

హోటల్స్, రెస్టారెంట్లలో నామమాత్రపు తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా కొన్నివేల హోటల్స్, రెస్టారెంట్లు, చిన్నాచితకా డాబాలు, ఫుడ్ కోర్టులు ద్వారా లక్షలాది మంది ప్రజలు ఆహారం తీసుకుంటున్నారు. వారికి నచ్చిన ఫుడ్‌ను ఆర్డర్ చేసుకుని మరీ తింటున్నారు. కొన్ని హోటల్స్ రెస్టారెంట్లలో కిచెన్‌లో పరిస్థితి వచ్చిన కస్టమర్‌కు తెలియదు, బయట హడావిడిగా షోయింగ్ పడిపోతాడు. లోపల ఫ్రిజర్‌లో ఎలాంటి ఆహారం నిల్వవుంది. వాటి నాణ్యత ఎలావుంది, వంట తయారీకి ఎటువంటి అయిల్ వినియోగిస్తున్నారు అనేది వినియోగదారుడికి తెలియదు, లోపలకి వెళ్లి చూసే పరిస్థితి కూడా ఉండదు. దీంతో లాభాపేక్షతో కొందరు రెస్టారెంట్, ఫుడ్ కోర్టుల నిర్వాహకులు ఆహార నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటాడుకుంటున్నారు. కనీసం నెలనెలా రెస్టారెంట్లను, హోటల్స్‌ను, ఫుడ్‌కోర్టులను సంబంధిత అధికారులు తనిఖీలు చేసే పరిస్థితులు కూడా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఇటీవల విజిలెన్స్ ఎస్పీ నేరుగా తనిఖీలు చేసిన పరిస్థితి కూడా చూశాం. విజిలెన్స్ తనిఖీ తర్వాత నగరపాలక సంస్థ 3 బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలపై దృష్టిపెట్టింది. కొన్నిచోట్ల ఉన్న రెస్టారెంట్లు, హోటల్స్‌లో తాజా నూనెలు వినియోగించడం లేదు. నూనెలో యాడిటివ్స్, ప్రిజర్వేటివ్స్, కలుషితాలతో ఉండకూడదు. నూనెలో టోటల్ పోలర్ మెటీరియల్ శాతం 25 మాత్రమే ఉండాలి. కానీ రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి లాంటి ప్రాంతాల్లోని కొన్ని హోటల్స్‌లో 60 నుంచి 70 శాతం ఉంటుంది. దీనిలో ఉడికించిన ఆహార పదార్థాలు స్వీకరిస్తే క్యాన్సర్ వస్తోంది. నూనెలు వింతవాసన వచ్చిన, గోదుమ రంగుల్లోకి వచ్చిన వాటిని వినియోగించరాదు. దాదాపు అన్నిచోట్ల నూనెలను దారుణంగా నలుపురంగు వచ్చేవరకు వాడుతున్నారు. తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగడంలేదు. ఏదొక సీజన్‌లో తనిఖీలుచేసి అటుపై మొద్దునిద్రలో సంబంధిత అధికారులు ఉంటున్నారు.

తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి

● గొట్టిముక్కల అనంతరావు, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు



ఆహార తయారీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టల్స్‌లో కూడా ఆహార తనిఖీలు చేపట్టాలి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు కొన్ని రెస్టారెంట్లను తనిఖీ చేసి కేసులు కూడా పెట్టించాం. డీసీపీసీ సమావేశంలో కూడా జిల్లా కలెక్టర్‌ను ఆహార తనిఖీలకు చర్యలు తీసుకోవాలని కోరాం. సిబ్బంది కొరత అని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. తనిఖీల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి. రాజమహేంద్రవరంలో రెస్టారెంట్లపై అనేక ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యం వెనుక కారణాలేమిటో?

జిల్లాలో 19 మండలాలు ఉన్నాయి. వాటిలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కాగా, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలుగా ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలు నగర పంచాయతీలు, గ్రామ పంచాతీలుగా ఉన్నాయి. రాజమహేంద్రవరంలో 5 స్టార్ హోటల్స్ మొదలుకొని, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, భోజనం హోటల్స్ అనేకం ఉన్నాయి. అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో కూడా హోటల్స్ ఉన్నాయి. ఆయా హోటల్స్ రెస్టారెంట్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కనీసం పట్టించుకోవడం లేదు. దీనివెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. మాముళ్ల మత్తులో ఉన్న కొంతమంది అధికారులు అండగా ఉండడంతో ఆహార భద్రత, నాణ్యత చట్టాలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఒకవేళ దాడులు చేసినా తీసుకున్న శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తారు కానీ వాటి రిపోర్టు రాదు, తదుపరి చర్యలు ఉండవు.

ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు లేకపోతే..

● కాల్ 9989688699: ఏఎఫ్‌సీ శ్రీనివాస్



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఏఎఫ్‌సీ) బి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆహారంలో విషయంలో నాణ్యతా ప్రమాణాలు లేవని గమనిస్తే వెంటనే జిల్లా ఆహార భద్రతా అధికారి 9849848070, తన నెంబరు 9989688699కి ఫోన్‌చేయాలని ఆయన సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదివారం పలు రెస్టారెంట్లు, ఈట్‌స్ట్రీట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటకాల్లో వినియోగించే సరుకులు, పెరుగు తదితర పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కొన్నింటిలో నిబంధనల ఉల్లంఘనలు గమనించి అక్కడికక్కడే జరిమానాలు విధించా మన్నారు. మంజీర, షెల్టన్, శ్రీకన్య, సితార, ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని శ్రీనివాస్ తెలిపారు. ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో వంటనూనె టీపీసీ రీడింగ్ నిబంధ నల ప్రకారం ఉండకపోవడంపై కేసు నమోదు చేశామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కచ్చితంగా పరిశుభ్రత పాటించాలన్నారు. తనిఖీల్లో జిల్లా ఆహార భద్రతా అధికారి వి.రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



వంటశాలల్లో ఆయిల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



మూడు రోజులలో 14 రైళ్లు రద్దు

సామర్లకోట, సెప్టెంబరు 22: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొవ్వూరు, గోదావరి, రాజమహేంద్రవరం, కడియం సెక్షన్‌లలో నాన్ ఇంటర్‌లాకింగ్ ప్రక్రియ, ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్‌ల ఏర్పాటు నిమిత్తం రైల్వే సిబ్బంది పనులు చేపట్టనున్నందున ఈనెల 29, 30 అక్టోబరు 1లో వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే 14 రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆది వారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సేకరించిన సమా చారం ఇలా ఉంది.

తిరుపతి-విశాఖ (22708) రైలు, గుంటూరు-విశాఖ(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఈనెల 29న రద్దు చేశారు. విశాఖ-తిరుపతి(22707) ఎక్స్‌ప్రె స్, విజయవాడ-విశాఖపట్నం (12718) ఎక్స్‌ప్రెస్, విశాఖ- విజయవాడ (12717) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (22701) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ(22702) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ (17239) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌ప్రెస్, విజయవాడ- రాజమహేంద్రవరం (07768) రైలు, రాజమహేంద్రవరం-విశాఖ (07466) రైలు, విశాఖ-రాజమహేంద్రవరం (07467) రైలు మొత్తం 10 రైళ్లు ఈ నెల 30న రద్దు చేశారు. విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే(17240) రైలు అక్టోబరు 1న రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సమీప రైల్వేస్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయంలో సంప్రదించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో
ఆహార భద్రతా అధికారులు శాంపిల్స్ సేకరణ

అన్నవరం, సెప్టెంబరు 22: అన్నవరం దేవస్థానంలో అన్నదానం, ప్రసాదం తయారీకి వినియోగించే ముడిపదార్థాలైన నెయ్యి, పప్పుదినుసులు, పంచదార తదితర పదార్థాలను ఆహార నియంత్రణ అధికారులు ఆదివారం శాంపిల్స్ సేకరించి తీసుకెళ్లారు. వీటిని తమ ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌కు పంపించి నాణ్యత పరిశీలిస్తామని ఈ నమూనాల ల్యాబ్ రిపోర్టుకు సుమారు 20 రోజుల సమయం పడుతుందని ఆహారభద్రత నియంత్రణ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రాథమిక పరిశీలనలో అంతా సవ్యంగానే ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నమూనాల పరీక్షలకు ఎక్కడికి పంపాలి అనేది తమ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని అన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ



అన్నవరం, సెప్టెంబరు 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ అయిన రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. పీఆరో కృష్ణారావు, సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు, సి.సి టు చైర్మన్ అత్తి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మస్కట్ రోడ్డు ప్రమాదంలో
నిడదవోలు యువకుడు మృతి

● స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం ● కంసాలిపాలెంలో విషాధచాయలు



మస్కట్ నుంచి వచ్చిన మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో అవిటి రాజు (ఫైల్)

నిడదవోలు, సెప్టెంబరు 22: ఆ ఇంటి పెద్ద కొడుకుగా ఇంటి బాధ్యతలను భుజానికి ఎత్తుకుని తల్లిదండ్రులను తమ్ముడిని బాగా చూసుకోవాలనే తపనతో ఉపాధి కోసం మస్కట్ వెళ్లాడు. ఆ యువకుడు నేడో రేపో తిరిగి వస్తాడని ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెంది మృతదేహం ఇంటికి రావడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి రాజు (24) సుమారు మూడేళ్ల క్రితం ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లాడు. తల్లిదండ్రులకు తమ్ముడికి అన్నీ తానై చూసుకొంటున్న అవిటి రాజు మస్కట్‌లో గతవారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. రాజు మృతి చెంది వారంరోజులు అయినా అనారోగ్యంతో ఉన్న అతని తల్లి ఎక్కడ ఆందోళన చెందుతుందో అని బంధువులు గ్రామస్తులు తల్లిదండ్రులకు తమ్ముడికి తెలియకుండా ఉంచారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని చికిత్స పొందుతున్నాడంటూ శనివారం వారికి సూచాయగా చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మస్కట్ నుంచి రాజు మృతదేహం బంధువులు గ్రామానికి చేర్చారు. తమ బిడ్డ లేడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ్ముడు బాధ వర్ణనాతీతం. నేడో రేపో తిరిగి వస్తాడని రాజుకు వివాహం చేయాలనే ఆలోచనలో ఉన్న కుటుంబానికి రాజు మృతదేహం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు సైతం రాజు మృతిపట్ల విషాధంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన గోవిందు

తునిరూరల్, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదంలో అన్నవరం దేవస్థానానికి చెందిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన ఎలుగు గోవిందు(26) అన్నవరం దేవస్థానంలో విధులు ముగించుకుని సైకిల్‌పై తేటగుంట గ్రామానికి వస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి పాత ఆర్టీవో చెక్‌పోస్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తుని రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌ను పోలీసులు పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తామని తునిరూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కృష్ణమాచార్య తెలిపారు.

దుర్వాసనను భరించలేకపోతున్నాం

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఎదుట స్థానికుల ఆందోళన
- పెట్రోల్ బాటిల్‌తో యువకుడి హల్‌చల్



అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

గోకవరం, సెప్టెంబరు 22: తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ స్థానికులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. పరిశ్రమ ప్రధానగేటువద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్వాసనతో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర వుతున్నాయని, పెద్దపెద్ద శబ్దాలు వెలువడుతుండడంతో పిల్లలు నిద్రపోవడం లేదంటూ ఆగ్రహవేశాలు వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థ నీటిని ఏవిధంగా ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై కూడా యాజమాన్యం ప్రజలకు వివరించాలని పట్టుబట్టారు. ఈ విషయంలో రివర్స్ బోరింగ్ పద్ధతిని చేపడుతున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో అనేకమార్లు ఇదే విషయంపై యాజమాన్యాన్ని నిలదీసినప్పటికీ వారిలో ఏమాత్రం మార్పు రాలేదని ఆవేదన చెందారు. ఈక్రమంలో ఓ యువకుడు తమకు న్యాయం చేసే వరకు పరిశ్రమలో జరిగే కార్యకలాపాలను నిలిపివేయాలంటూ పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేయడంతో అక్కడ వాతావరణం మరింత వేడెక్కింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో చర్చించారు. యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. తమ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పరిశ్రమ ముందు భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రంలోని 25జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో కొత్త ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా మేడ సురేష్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జిగా జగత శ్రీనివాస్, రాజమహేంద్రవరం జిల్లా ఇన్‌చార్జిగా కొలనుకొండ శివాజీలను నియమించారు.

శెట్టిబలిజ సంఘం సమావేశం రసాభసా

● ఇరువర్గాలు .తోపులాట ....చెదరగొట్టిన పోలీసులు



సమావేశంలో ఇరువర్గాల తోపులాట దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 22: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశం ఆదివారం ఉద్రిక్తతల నడుమ రసాభసాగా ముగిసింది. మధ్యాహ్నం తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం ప్రారంభమైంది. శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు ఎంపీ బోస్ సారథ్యంలో మాజీ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతుండగా మంత్రి సుభాష్ వర్గానికి చెందిన శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గతంలో ప్రకటించిన దొంగల శ్రీధర్ మద్దతు దారులు బోస్ ప్రసంగానికి అడ్డుతగిలారు. బోస్ గో బ్యాక్, బోస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ దశలో బోస్ వర్గీయులు పోటీగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు తోపులాట జరిగే పరిస్థితి నెలకొంది. దీంతో డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు సీఐలు, ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఇరువర్గాలు పరుగులు తీశారు. దీంతో సమావేశం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీ బోసు ప్రకటించారు. ఎన్నికలను కొన్నిశక్తులు అడ్డుకుంటున్నాయని అన్నారు. శెట్టిబలిజ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా పనిచేసి రాజీనామా చేసిన నరాల ఏడుకొండలు అధ్యక్షుడిగా, పలివెల నాగరాజు కార్యదర్శిగా కొనసాగుతారని బోస్ ప్రకటించారు. శాంతియుత వాతావరణం ఏర్పడేవరకు కొనసాగుతారని తెలిపారు.

అందరి సమక్షంలోనే ఎన్నికయ్యాం

దొంగల శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల సంఘం సమావేశం ఏర్పాటుచేసి తాలూకా శెట్టిబలిజ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని అందులో అధ్యక్షుడిగా తనను, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావుతోపాటు పార్టీలకతీతంగా కార్యవర్గం ఎన్నుకున్నారన్నారు. ఎంపీ బోస్ సంఘంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టేకుమూడి సత్యనారాయణ, పలివెల నాగరాజు, కాలా సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

వరద నుంచి బయటపడ్డ
గండిపోశమ్మ అమ్మవారు



గండిపోశమ్మ అమ్మవారి విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

దేవీపట్నం, సెప్టెంబరు 22: గత మూడు నెలల నుంచి వరద నీటిలో ఉండిపోయిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం ఆదివారం బయటపడింది. అమ్మవారి ఆలయం శుభ్రం చేసేందుకు తలుపులు తెరవగా అమ్మవారి తలపై నాగుపాము నాట్యమాడి మాయమైనట్లు పూజారి తెలిపారు. ఆలయ అధికారులు అమ్మవారి ఆలయంలో బురదను తొలగించారు. అమ్మవారి విగ్రహాన్ని శుభ్రపరుస్తున్నారు. ప్రతీ ఏడాది వరద సమయంలో అమ్మవారి ఆలయం నెలలు తరబడి ముంపులోనే ఉండడంతో మైదాన ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పోశమ్మగండి ఆలయం వరద ముంపు బారిన పడకుండా ఆలయం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలకృష్ణ



పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మండలంలోని బొమ్మూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీ విషయంలో భక్తుల మనోభావాలపై చంద్రబాబు దారుణమైన నింద వేశారన్నారు. అదే విషయమై సీబీఐతో విచారణ చేయించాలన్నారు. నిల్వ ఉంచిన ఇసుకను దొంగలించిన టీడీపీ నేతలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా వేణుకు పార్టీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మీ, గూడూరి శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 22 : గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని పిండాలరేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోదావరి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. 60 నుంచి 65 సంవత్సరాలు ఉంటుందని, అతని ఒంటిపై సిమ్మెంటు రంగుపై తెలుపు నిలువు చారలు కలిగిన పొడుగు చేతుల చొక్కా ధరించి, గెడ్డం మాసి ఉందన్నారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, సెల్ 9440796622కు సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు
- శ్రీప్రకాష్‌లో ఘనంగా ముగిసిన క్లస్టర్ లెవెల్ టీటీ పోటీలు



టీటీ పోటీల్లో గెలుపొందిన విజేతలు

పెద్దాపురం, సెప్టెంబరు 22: బాల్యం నుంచి క్రీడలపై మక్కువను పెంచుకోవాలని, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ లెవెల్ సీబీఎస్‌ఈ టేబుల్ టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ముందుగా ఆయనకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ సాదరంగా ఆహ్వానం పలికారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పెద్దాపురం పట్టణంలో క్లస్టర్ స్థాయిలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్ణయించుకోవా లని, అలాగే క్రీడలపట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. సాటిమేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. టీటీ ఇంటర్‌నేషనల్ కోచ్ సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే అహర్నిశలూ సాధన చేయాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తమ పాఠశాలలో జాతీయస్థాయిలో టీటీ పోటీలు కార్యక్రమానికి వేదిక అయ్యిందని గుర్తుచేసుకున్నారు. కాకినాడ టీటీ వైస్ ప్రెసిడెంట్ దంటు భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులు అంతా చక్కని ప్రతిభను కనభరిచారని, గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్‌మూర్తి, రమణకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.





భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తలుపులమ్మా కరుణించమ్మా!

● లోవ ఆలయానికి రూ.3.64లక్షల ఆదాయం

తుని రూరల్, సెప్టెంబరు 22: తూర్పు కనుమల్లో కొలువై తలంపులమ్మగా మహిమలు విరాజిల్లుతున్న లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వంట షెడ్‌లతోపాటు వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే అమ్మవారిని 20వేల మంది భక్తులు దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.64లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

వర్గీకరణకు మద్దతు పలికితే గుణపాఠం తప్పదు

ఐ.పోలవరం, సెప్టెంబరు 22: ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికే రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని మాలమహానాడు నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఐ.పోలవరంలో జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెయ్యల పరశురాముడు, జిల్లా కార్యదర్శి రేవు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీను, యలమంచిలి బాలరాజు, వడ్డి గౌతమ్, మట్ట గనవీరుడు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎంపీ హరీష్‌మాధుర్
- కపిలేశ్వరపురంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం
- కరపత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు బండారు, గిడ్డి

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు22: రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంపీ హరీష్‌మాధుర్ అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు. వంద రోజుల ఎన్డీఏ కూటమి పాలనలో అమలుచేసిన హామీలపై ముద్రించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, చేనేత కార్మికులు జీఎస్‌టీ రద్దు, సామాజిక పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ అమలు, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ చేసిందన్నారు. ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి జీఎంసీ బాలయోగి ఇచ్చిన హామీలను నెరవేర్చనున్నట్లు తెలిపారు. గ్రామంలోని శ్మశానవాటిక అభివృద్ధి, తదితర అంశాలను గ్రామసర్పంచ్ శ్రీనివాస్ వారి దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.4,26,484 చెక్కులను ఎమ్మెల్యే ఎంపీ అందజేసారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముత్యాల వెంకట్రావు, పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, నామాల బొజ్జియ్య, నెక్కంటి శ్రీరాంజీ, బలవరెడ్డి సత్తిబాబు, పర్వతిన మురళీకృష్ణ, కొప్పిశెట్టి వాసు, నామాల శ్రీనివాస్, కాద వెంకటరాంబాబు, వీధి ప్రసాద్, సర్పంచ్‌లు ఆచంట సత్యనారాయణ, దాసి మీనాకుమారి, ఎంపీటీసీ శీలం భాస్కరరావు, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ చిన్నారావు, కార్యదర్శి శివచక్రవర్తి, వివిధ శాఖల అధికార్లు పాల్గొన్నారు.



ఆత్రేయపురం: కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, పి.గన్నవరం: కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం

రాజోలు, సెప్టెంబరు 22: రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.135కోట్లతో ప్రణాళికలు సిద్ధంచేసి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందజేశామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పొన్నమండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్డీఏ వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ కుక్కల బేబికుమారి అధ్యక్షతన ఆదివారం జరిగిన ప్రజావేదిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్లీన్ రాజోలుగా తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మరో ముఖ్య అతిథి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వంద సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రజాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీను, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, ఎంపీడీవో ఎన్.బాలాజీ, ప్రత్యేకాధికారి డి.రాంబాబు, సర్పంచ్ అడబాల శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు గాలిదేవర వెంకన్నబాబు, ఎంపీటీసీలు కడలి శ్రీదుర్గ, మోకా ఉష, సీనియర్ టీడీపీ నాయకుడు కడలి అబ్బు, మోహన్, మామిడిశెట్టి నాగరాజు, మోకా ఏడుకొండలు, దాకే ఏడుకొండలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఆత్రేయపురం, సెప్టెంబరు 22: ఆత్రేయపురంలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభ నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి గోడలకు స్టిక్కర్లు అంటించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం 100రోజుల్లో ప్రజారంజక పాలన సాగించిందన్నారు. క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. మొక్కలు పంపిణీ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, కంఠంశెట్టి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, తోటకూర సుబ్బరాజు, సర్పంచ్‌లు గెడ్డం సుధ, కుదప కృష్ణమూర్తి, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, జుజ్జవరపు శ్యామల, ముత్యాల బాబ్జీ, ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ అభివృద్ధి, సంక్షేమం

పి.గన్నవరం, సెప్టెంబరు 22: సంక్షోభంలో కూడా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. నాగుల్లంకలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. పింఛన్ల పెంపు, ఒకటో తేదీన జీతాలు అందించడం, ల్యాండ్‌టైటిలింగ్ యాక్టు రద్దు, పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్‌కమిటీ కన్వీనర్ నామన రాంబాబులను స్థానిక కూటమి నాయకులు పౌరసన్మానం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకరవరప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతీ, జేఈలు కళ్యాణచక్రవర్తి, ఆనంద్, నాయకులు, చెల్లుబోయిన గంగాదేవి, బొండాడ నాగమణి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తి బాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పాలూరి ఫణి, చొల్లంగి సత్తిబాబు, అరుమిల్లి సాయిబాబు, శేరు శ్రీను బాబు, పత్తిపాటి వెంకన్నబాబు, పాలూరి వీరభద్రం, ఆది మూలం సూరయ్యకాపు, గుత్తుల రామకృష్ణ, పితాని ఏడుకొండలు పాల్గొన్నారు.

చినకొత్తలంకలో ఇది మంచి ప్రభుత్వం

ముమ్మిడివరం, సెప్టెంబరు 22: చినకొత్తలంకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, కొత్తూరి మల్లికార్జునవర్మ, టీవీవీ సత్యనారాయణరాజు, పెద్దిరెడ్డి సత్య గోపాలకృష్ణ, పచ్చమట్ల చైతన్యవర్మ, పచ్చమట్ల వెంకటేశ్వరరాజు, గుత్తుల పల్లయ్య, కేశనకుర్తి సురేష్, నాగులపల్లి బాలయోగి, పితాని వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం, వనచర్ల సాయివల్లీ, పితాని రామచంద్రరావు పాల్గొన్నారు.

ద్వారపూడిలో ఇది మంచి ప్రభుత్వం

మండపేట, సెప్టెంబరు 22: ద్వారపూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలపై ప్రచురించిన కరపత్రాలను స్థానిక నేతలు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల ఉద్యోగులు ప్రజలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి అజీజ్, పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జనసేన నాయకులు చింతా దొరబాబు, టీడీపీ నాయకులు గోణం పుల్లయ్య పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ

అల్లవరం, సెప్టెంబరు 22: కూటమి పాలనలో 100 రోజుల ప్రగతిపై మండలంలోని తుమ్మలపల్లి, గోడితిప్ప, బోడసకుర్రు అల్లవరం గ్రామాల్లో సర్పంచ్‌లు వడ్డి సుభాషిణి, చిట్నీడి శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మి, బొమ్ము బాలవేణి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి ఇళ్ల గోడలపై స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు సత్తిబాబు, సుంకర సాయిబాబా, ఎంపీటీసీ నిచ్చనకోళ్ళ మౌనిక వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీచు బొమ్మల మరింత అభివృద్ధికే శిక్షణ

మామిడికుదురు, సెప్టెంబరు 22: కొబ్బరి పీచుతో తయారుచేసే వివిధ రకాల వస్తువులను మరింత అభివృద్ధి చేయడానికి మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్ తెలిపారు. పాశర్లపూడిలో జరుగుతున్న కొబ్బరి పీచు బొమ్మల శిక్షణా కేంద్రాన్ని పీడీ ఆదివారం సందర్శించారు. ఒడిశా నుంచి వచ్చిన శిక్షకులు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పీచు బొమ్మలను అమ్మకాలు చేయడానికి బ్యాంకు ద్వారా రుణలు ఇవ్వడానికి అన్ని సహకారాలను డ్వాక్రా సంస్థల ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. విలువ ఆధారిత బొమ్మల తయారీ శిక్షణ పాశర్లపూడిలోని ఆక్సిజన్ ఆసోసియేషన్ సారథ్యంలో 30మంది మహిళలకు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, మహిళలు పాల్గొన్నారు.

దళిత సంఘాల నేతల నిరసన



అమలాపురం టౌన్, సెప్టెంబరు 22: దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని, లేనిపక్షంలో తీవ్ర ఉద్యమం చేపడతామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం గడియార స్తంభం సెంటర్‌లో దళితులు నిరసన తెలిపారు. ఇటీవల ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ చిత్రపటాన్ని అవమానించారని, కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత వైద్యులపై దాడికి దిగారని, కొవ్వూరులో దళితులపై దాడులకు తెగబడ్డవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోనసీమ జేఏసీ దళిత నేత జంగా బాబూరావు నాయకత్వం వహించగా కారెం వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, గెడ్డం సురేష్‌బాబు, ఉండ్రు వెంకటేష్, వివిధ ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఆదివారం ముమ్మిడివరంలోని పోలమ్మ చెరువుగట్టున ఉన్న బుద్ధ పార్కు ఆవరణలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చర్యలను ఖండిస్తూ రిపబ్లికన్ పార్టీ నాయకులు ఆందోళన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులు మట్టా వెంకట్రావు, దోనిపాటి ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోద చేయాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీకురుమెల్లి శ్రీనివాస్, ముంగండ ఆశీర్వాదం, పంతగడ నరసింహమూర్తి, టి.వెంకటేశ్వరరావు, నకిలే సూర్యనారాయణ, వడ్డి నాగేశ్వరరావు, యలమంచిలి బాలరాజు, గిడ్డి ప్రభాకరరెడ్డి, కాశి సింహాద్రివర్య, మట్టా వెంకటరమణ, కొంకి అంబేడ్కర్, వాకపల్లి వెంకటరత్నం, పృథ్వీరాజ్, పెట్టా శ్రీను, గిడ్డి ప్రసాద్‌లతో పాటు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబేడ్కర్‌ను అవమానించే విధంగా ప్రవర్తించినఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా నిరసన ఆదివారం చేపట్టారు. అనంతరం రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నెల్లి వెంకటరమణ, నాగవరపు నాగరాజు, గోసంగి సత్యనారాయణ, నూకపెయ్యి చిన్న, కొల్లి శ్రీనివాస్, బీర సురేష్, గోసంగి కుమారస్వామి, కోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ రామేశ్వరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాన్ని అవమానించిన ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ ఆదివారం రామేశ్వరంలో యువత ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో సరెళ్ల విజయప్రసాద్, దళిత నాయకులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కాట్రేనికోన, సెప్టెంబరు22: బలుసుతిప్పకు చెందిన మేడా జయనారాయణ(33) ఈనెల20న మగసానితిప్పమొగలో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆదివారం మృతదేహం లభ్యంకాగా బలుసుతిప్పకు తీసుకువచ్చారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ అవినాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండపేట జోనల్ ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మండపేట, సెప్టెంబరు22: స్థానిక లయన్స్ క్లబ్‌లో మండపేట జోనల్ ఫొటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ నేతలు వేగుళ్ల పట్టాభి రామయ్య రెడ్డి రాధాకృష్ణ, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు హాజరయ్యారు. కార్యవర్గాన్ని వారు అభినందించారు. ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసాఇచ్చారు. జోనల్ ఫొటోగ్రాపర్స్ అధ్యక్షుడిగా గంగుమళ్ల వెంకటేష్, కార్యదర్శిగా సంగులు దొరబాబు, కోశాధికారిగా కాకి దానియేలు, ఉపాధ్యక్షులుగా అల్లాడ శ్రీనివాస్, పి.వి.వి.సత్యనారాయణ, ట్రెజరర్‌గా దుప్పల పూడి వీరభద్రరావు, మీడియా సలహాదారుడుగా మల్లేశ్వర్, సభ్యులుగా పావులూరి సురేష్, సత్తి రామకృష్ణారెడ్డి, పాశం త్రిమూర్తులు, నంబు రాము, మణికంఠ, రాజ కుమార్, కానూరి సురేంద్ర, సురేష్‌లతో రాష్ట్ర అధ్యక్షుడు వి.వీరేంద్రకుమార్ ప్రమాణ స్వీకారంచేయించారు. ఫొటోగ్రాఫర్స్ యూనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్కా రాం బాబు, జిన్నూరి సాయి బాబా, జిల్లా మండల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార బ్యాంకులు



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 22: డీసీసీబీ సారధ్యంలో గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు కొండంత అండగా ఉంటూ వివిధ రకాల సేవలందిస్తున్నాయని సహకార నోడల్ అధికారి కుచ్చెర్లపాటి ఎస్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. డిపాజిట్ల సేకరణ మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఉప్పలగుప్తంలో డీసీసీబీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంట రుణాలతో పాటు వాణిజ్య బ్యాంకులకు దీటుగా వివిధ రకాల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ చెల్లించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని సహకార బ్యాంకుల ఖాతాల ద్వారా రైతులకు అందిస్తున్నామన్నారు. సహకార బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం ద్వారా సహకారాన్ని మరింత విస్తరింపజేసేందుకు తమకు సహకరించాలని కోరారు. డీసీసీబీ ఉప్పలగుప్తంశాఖ మేనేజరు పేరి శర్మ, సూపర్‌వైజర్ ఎం.నరేష్, అమలాపురం డీసీసీబీ సిబ్బంది, మండల సొసైటీల సీఈవోలు, సిబ్బందిపాల్గొన్నారు.

ఎన్నికల్లో గొల్లపల్లి గెలిస్తే గుండు గీయించుకుంటా

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, సెప్టెంబరు 22: యానాంలో రానున్న ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ విజయం సాధిస్తే తాను గుండు గీయించుకుంటానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బహిరంగంగా ప్రకటించారు. ఆదివారం సాయంత్రం యానాం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఉన్న సూర్య క్లబ్ ఎదురుగా మల్లాడి ఆందోళన చేపట్టారు. తొలుత తన స్వగృహంలో ఏర్పాటుచేసిన నాయకులు, కార్యకర్తలు సమావేశంలో మల్లాడి మాట్లాడారు. అనంతరం ర్యాలీగా సూర్య క్లబ్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు గిడ్ల చంద్రరావు, మల్లాడి శామ్యూల్, పెండె సూర్యప్రకాష్ మాట్లాడారు. అనంతరం మల్లాడి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఏఒక్క క్లబ్ యానాంలో ఏర్పాటు కాలేదన్నారు. అధికారం మారిన వెంటనే క్లబ్‌లు యానాంలో పుట్టుకొచ్చాయన్నారు. ఒకప్పుడు పర్యాటక కేంద్రంగా ఉన్న యానాం ఇప్పుడు పేకాట కేంద్రంగా మారిందన్నారు. సుప్రీం కోర్టు వరకు వెళ్లి రాయల్ క్లబ్‌ను మూయించామన్నారు. సూర్య క్లబ్‌ను మూయకపోతే తాను ఆందోళనచేస్తానని ప్రకటించడంతో ఇప్పుడు సూర్య క్లబ్‌ను తాత్కాలికంగా మూశారని మల్లాడి అన్నారు. సూర్య క్లబ్‌ను శాశ్వతంగా మూస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సూర్య క్లబ్‌ను శాశ్వతంగా మూయించే వరకు పోరాటం ఆగదన్నారు. సూర్య క్లబ్ నిర్వహణలో పోలీస్ శాఖలో ఐదుగురు ఉన్నతాధికారుల పాత్ర ముఖ్యంగా ఉందని తెలిసిందని, త్వరలోనే వారిపై కూడా పుదుచ్చేరి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో గొల్లపల్లి గెలిస్తే తాను గుండు గీయించుకుంటానని మల్లాడి అన్నారు. మహిళలు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

మండపేట, సెప్టెంబరు 22: పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేసిన విశ్రాంత ఉద్యోగి వి.రవికృష్ణ సేవలు మరువలేనివని విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సూర్యకన్వెన్షన్ హాల్‌లో ఉభయగోదావరి జిల్లాల విశ్రాంత ఉద్యోగుల సమావేశం కామ్రేడ్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా వి.రవికృష్ణ మాట్లాడుతూ 30ఏళ్ల నుంచి 388మంది ఉద్యోగులు చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. ఏపీలో న్యాయస్థానం తీర్పును అమలు చేస్తున్నప్పటికి హైదరాబాద్ రీజనల్ అధికారులు న్యాయస్థానం తీర్పుకు వక్రభాష్యం పలుకుతున్నారని ఆరోపించారు. డివిజనల్ విశ్రాంత ఉద్యోగుల కార్యదర్శి ఎస్.రామలింగేశ్వరరావు, కె.బాలకామేశ్వరి, ఆకుల శ్రీనివాస్, ఎస్.ప్రసాద్, టి.పుల్లేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు రవికృష్ణను సత్కరించారు.

3నుంచి విజయదుర్గా పీఠంలో దేవి నవరాత్రి ఉత్సవాలు


గాడ్ సమక్షంలో శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

రాయవరం, సెప్టెంబరు 22: వెదురుపాక విజయదుర్గా పీఠంలో 53వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3నుంచి 12వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆదివారం తెలిపారు. గాడ్ సమక్షంలో పీఠంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 3న ఆశ్వీయుజ శుద్ధపాడ్యమి హస్త నక్షత్రం ఉదయం 8:19గంటలకు అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు.నవరాత్రుల్లో అమ్మవారి అవతారాలు: 3న బాలాత్రిపుర సుందరిదేవి, 4న గాయత్రిదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా దేవి, 7న రజత కవచ విజయదుర్గాదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దినీదేవి, 12న రాజరాజేశ్వరిదేవి అవతారాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. ప్రతిరోజు పీఠంలో శ్రీచక్ర అర్చనలు, సప్తసతిపారాయణం, దేవియాగం, నవావరణ అర్చన, ప్రతి రోజు సాయంత్రం 4గంటలకు వేదపారాయణం, దేవిభాగవత ప్రవచనాలు, సాయంత్రం 6గంటలకు శ్రీలలితా, విష్ణుసహస్రనామ సామూహిక పారాయణ, సాయంత్రం నక్షత్ర హారతి, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేదస్వస్తి, దర్బారుసేవ, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్య కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, సెప్టెంబరు 22: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు ఆదివారం అమలాపురానికి చెందిన కరుప్రోలు నాగ సూర్యకాంతం, కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. వారికి ఆలయ ప్రధానార్చకుడు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

ఎమ్మెల్యే నానాజీ వైఖరిని ఖండించిన మాలమహానాడు

కె.గంగవరం, సెప్టెంబరు 22: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత కులానికి చెందినడాక్టర్‌ను దూషించడం, చెయ్యి చేసుకున్న సంఘటనను రామచంద్రపురం నియోజకవర్గం మాలమహానాడు నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మాల మహానాడు నాయకులు రవ్వా భూషణం, తరపట్ల ఆనందరావు, పి.జ్యోతి కుమార పోతు రాజు, భీమారావు, ఈరెళ్ళ రాజు, విన కోటి శ్రీనివాసరావు, చిల్లా గోపాలకృష్ణ, మాతాస్వామి ఉన్నారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు జనసేన సంఘీభావం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 22: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు ఆదివారం జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. అంగర శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావంగా కర్పూరాన్ని వెలిగించి పవన్‌కల్యాణ్ దీక్ష విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సూరిబాబు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ చేపట్టిన 11రోజుల ప్రాయశ్చిత దీక్ష విజయవంతం కావాలని కోరారు. పార్టీ గ్రామఅధ్యక్షులు కర్రి తాతాజీ, తోరాటి శ్రీనివాస్, పిల్లా బసవరాజు, చీకట్ల గంగరాజు, లోవరాజు పాల్గొన్నారు.

అల్లవరం: తిరుమల లడ్డూ ప్రసాదంలో గత పాలనలో జరిగిన అపవిత్రతకు నిరసనగా పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు జన సైనికులు మద్దతు ప్రకటించారు. కంకిపాటి వీరబాబు, చేట్ల మంగతాయారు, పిండి గణపయ్య, మేడిద శంకరరావు, గుర్రం కృష్ణ, నల్లా రాము, చిట్నీడి శ్రీనివాస్, కంకిపాటి అరుణ్, పిల్లా ప్రసాద్, కంకిపాటి సుబ్బారావు మద్దతు తెలిపారు.

వినాయకుడిని దర్శించుకున్న ఎంపీ హరీష్

అంబాజీపేట, సెప్టెంబరు 22: మాచవరంలో వినాయకుడిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అనంతరం ఎంపీని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, బొంతు పెదబాబు, గుడాల ఫణి, అరిగెల సూరిబాబు, చిన్నం బాలవిజయరావు, పెదపూడి శ్రీనివాసరావు, మైపాల తాతాజీ, అత్తిలి పెదపుల్లయ్య, దొమ్మేటి త్రిమూర్తులు, దాసరి చిన్న, వాసు, యేడిద దొరబాబు, దొమ్మేటి రాంబాబు, మట్టా నాగేంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

యానాం, సెప్టెంబరు22: యానాం శివారు దరియాలతిప్ప రోడ్డులో ఇటీవల మూతపడిన రాయల్ రిక్రియేషన్ క్లబ్‌లో చోరీకి గురైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందన్ వివరాల ను వెల్లడించారు. క్లబ్ మూత పడటంతో విడతల వారీగా ఫ్రిజ్, నాలుగు ఏసీలు, ఎనిమిది టీవీలు, వంట సామగ్రి తదితర 41వస్తువులను దరియాలతిప్పకు చెందిన యొద్దు అలెక్స్, వెంటపల్లి శ్రీను, పోతుల సుబ్బారావు, మామిడి సందీప్‌కుమార్ అపహరించార న్నారు. దీనిపై నిర్వాహకులు చేసిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ఇద్దరు నిందితులు శ్రీను, సందీప్ కుమార్ పోలీసులకు లొంగిపోయ్యారన్నారు. వారు విక్రయించిన, భద్రపరిచిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న అలెక్స్, సబ్బారావుల కోసం గాలిస్తున్నామన్నారు. పోలీసులు నిందితులను యానాం కోర్టులో హాజరుపర్చామన్నారు.

27న మెగా జాబ్‌మేళా

పి.గన్నవరం, సెప్టెంబరు22: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పి.గన్నవరం గ్రేస్‌డిగ్రీ కళాశాలలో ఈనెల27న మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గోడపత్రికను ఆవిష్కరించారు. ఈమేళాలో 18కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసం శెట్టి కుమార్, మండల అధ్యక్షుడు సాధ నాల శ్రీవెంకటసత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూ ప్రసాదం ఘటనపై నిరసన

మలికిపురం, సెప్టెంబరు 22: తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వ హయాంలో స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వుతో కలిసిన నెయ్యి వాడినట్టుగా వస్తున్న ఆరోపణలపై లక్కవరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లి జరిగిన అపరాధాన్ని క్షమించమని కోరుకున్నారు. కార్యక్రమంలో మంగెన భూదేవి, మంగెన మురళీకృష్ణ, బోనం రాజు, వలవల రమేష్, శృంగవరపు బాబు, ఆవుపాటి శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: తిరుపతి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొత్తపేటలో మాట్లాడుతూ తిరుమలతో పాటు అన్నవరం, సింహాచలం వంటి ప్రసిద్ధ ఆలయాల్లో కూడా కల్తీ వ్యవహారం ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రావులపాలెం: తిరుమల లడ్డూ తయారీలో కల్తీపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ నేత తమలంపూడి రామకృష్ణారెడ్డి కోరారు. రావులపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు జరగకుండా సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

పి.గన్నవరం: శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి సరఫరాకు పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. పి.గన్నవరంలో వారు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబులు ర్యాలీలో పాల్గొని వైసీపీ హయాంలో టీటీడీని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. అనంతరం హైస్కూల్ సెంటర్ నుంచి త్రీరోడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు, బజరంగ్‌దళ్ సభ్యులు నాయుడు, సోమా, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: తిరుమలలోజరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని పలువురు ఆధ్యాత్మిక సేవకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జి.వేమవరంలో ఆదివారం ఆధ్యాత్మిక సేవకులు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా లడ్డూను అపవిత్రం చేశారని ఆరోపించారు. రెల్లు గంగాధరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల సహకన్వీనర్ చప్పిడి దానేశ్వరరావు, చోడిశెట్టి బ్రహ్మానందం, గుత్తుల త్రిమూర్తులు, కంతేటి కుమార్, రేవు సింహాచలం, చోడిశెట్టి రమేష్, ఆకుల సత్తిబాబు, బొంతు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా కోనసీమ జిల్లా సర్వసభ్య సమావేశం

మలికిపురం, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) సర్వసభ్య సమావేశం ఆదివారం గూడపల్లి గౌతమ్ స్కూలు వద్ద జరిగింది. రాష్ట్ర అపుస్మా సెక్రటరీ కె.తులసీ విష్ణుప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్ స్కూలు కరస్పాడెంట్ ఎస్వీ రమణారావు, కార్యదర్శిగా చిల్డ్రన్స్ స్కూలు కరస్పాండెంట్ టీఎస్ఆర్ అయ్యప్పనాయుడు, కోశాధికారిగా కోనసీమ స్కూలు కరస్పాండెంట్ నూలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రాజోలు డివిజన్ అపుస్మా అధ్యక్షుడిగా జి.రత్నరాజు, కార్యదర్శిగా పోతురాజు చిన్నా(మానస), కోశాధికారిగా కె.కిరణ్‌కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో డి.సత్తిబాబు, ఆర్.గోపీనాథ్, కల్యాణ్‌రెడ్డి, ఎ.బాపన్నాయుడు, ఆదిత్య సుబ్రహ్మణ్యం, కంకటాల శ్రీనివాస్, దివ్వి రామచేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న విజయభేతాళ స్వామి ఉత్సవం

అంబాజీపేట, సెప్టెంబరు22: అంబాజీపేటలో వేంచేసియున్న శ్రీ విజయభేతాళ స్వామి వారి ఉత్సవాన్ని వచ్చే నెల16న నిర్వహించనున్నట్లు శ్రీశెట్టిబలిజ అభ్యుదయ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరామరావు, ఉత్సవకమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునరావు తెలిపారు. అంబాజీపేట సంఘ భవనంలో సమావేశం సంఘ కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈసందర్భంగాఅక్టోబరు 3న మాచవరం రామ్‌ఘాట్ నుంచి శ్రీవిజయభేతాళ స్వామి ఊరేగింపు జరుగుతుందన్నారు. కలశస్థాపనకు 13వాహనాలకు చెందిన కమిటీ సభ్యులకు హాజరుకావాలని కోరారు. ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ఆయాకమిటీలు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు దొమ్మేటి శ్యామ్, బొంతు పెదబాబు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి సోమేశ్వరావు, దొమ్మేటి సాయికృష్ణ, గుత్తుల పండు, మట్టపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు.

గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం

కె.గంగవరం, సెప్టెంబరు 22: కుందూరు, సుందరపల్లి, మసకపల్లి, బాలాంత్రం, అముజూరు, సత్యవాడ, కోటిపల్లి, కోట, మసకపల్లి, భట్లపాలిక తదితర గ్రామాల్లో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులపై ప్రచురించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కూటమి నాయకులు మరివాడ చిన్ని కృష్ణ, ఎనుముల గోపాలకృష్ణ, జగతా రమణ, రవ్వా భూషణం, శీరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పూడి కుర్రోడికి గోల్డ్ మెడల్


తేజశ్రీరామ్

కాట్రేనికోన, సెప్టెంబరు 22: ఉప్పూడికి చెందిన ర్యాలి తేజశ్రీరామ్ గోవా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎంటెక్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. శ్రీరామ్ బెంగళూరులో ఉద్యోగం సంపాదించాడు. అతని తండ్రి గంగాధర వెంకటేశ్వరరావు (చిట్టిబాబు) చిరువ్యాపారి. కేవలం మెరిట్ ఆధారంగా ఉన్నతిని సాధించిన తేజశ్రీరామ్‌ను గ్రామస్థులు అభినందించారు.

కావ్య మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ఆలమూరు, సెప్టెంబరు 22: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న డా.కావ్య మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం మడికిలో స్వర్గీయ డాక్టర్ సింగలూరి కావ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. ఈవైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈసందర్భంగా పలు విభాగాలకు చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య కుటుంబసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: ఉత్సాహం
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: ఆయ్
రమా	: మత్తువదలరా-2
గణపతి	: కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గొర్రె పురాణం